# లాస్యనందితను గెలిపించుకుంటాం

## • బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ఇంటింటికీ ప్రచారం



బొల్లారంలో మ్యానిఫెస్టో వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్


బొల్లారం,నవంబర్ 8: బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం సదర్ బజార్,టీఐటీ బ్లాక్ ,అంబేద్కర్ నగర్‌లో బస్తీల్లో బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్,మార్కెట్ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డితో కలిసి కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్య నందితకు మద్దతుగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్,మార్కెట్ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి,మాజీ చైర్మన్ ఖదీరవన్,వార్డు అధ్యక్షుడు కేజీ రవి కుమార్,జంగాల మురళీ యాదవ్,ఈఆర్ బాల్‌రాజు,ఎర్రోళ్ల గిరి,ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలను వివరిస్తూ...

మారేడ్‌పల్లి, నవంబర్ 8: కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా బుధవారం జీహెచ్ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సీఎన్ నర్సింహముదిరాజ్ ఆధ్వర్యంలో మోండా డివిజన్‌లోని రెజిమెంటల్ బజార్, పరికిబస్తీ, వసంత అపార్టుమెంట్, హిల్టన్ హోటల్ లైన్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు ప్రజలకు వివరిస్తూ...కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్ ముదిరాజ్ నీలాంకర్, సతీశ్, రామకృష్ణ, ప్రవీణ్, క్రిష్టోఫర్, సాయి కిరణ్, రాంపల్లి గోపి బాబు, కిరణ్ , బాబా, సందీప్, టింకు , పరుశరాం, వెంకటేశ్ , రాజు, నరేశ్ పాల్గొన్నారు.

### మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

కంటోన్మెంట్, నవంబర్ 8: మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేసినట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. న్యూ బోయిన్‌పల్లిలోని పెన్షన్‌లైన్‌లో మంగళవారం రాత్రి మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి మైనార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయన్నారు. మైనార్టీలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని చెప్పారు. మైనార్టీల కోసం షాదీ ముబారక్, కుట్టుమిషన్ల పంపిణీ, మైనార్టీ రుణాలు, మైనార్టీ స్కూల్స్, ఓవర్సీస్ సాలర్‌షిప్స్, బక్రీద్, రంజాన్ సమయంలో కానుకలు, ఇఫ్తార్ విందు, ఇమామ్‌లకు రూ.5వేలు వంటి పథకాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణదే అన్నారు. మత విద్వేషాలకు, మత రాజకీయాలకు తెలంగాణలో చోటు లేదన్నారు. ఎన్నికల సమయంలో మైనార్టీల దగ్గరకు వచ్చే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనార్టీల సంక్షేమానికి, భద్రతకు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం మైనార్టీలకు రూ.లక్ష రుణం పూర్తి సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఉన్నత చదువు కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇప్పటికే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించామని తెలిపారు. విద్య, వైద్యం, ఉద్యోగాల విషయంలో మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే పెన్షన్‌లైన్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించడం జరిగిందని, త్వరలోనే ఫైజాన్ స్కూల్ పక్కన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హాసీన్, ఇర్ఫాన్, తారీఖ్, అజామ్, ఇంతియాజ్, ఇమ్రాన్, సుల్తాన్, అఫ్జల్ భాయ్, ఉబైద్, ఖాదర్ భాయ్, హాసన్, అంజద్, ఆలీమ్, కలీం, ఫహద్, సాజీద్, హానీఫ్, జహీర్, సమీర్, ముక్తార్, ఆరీఫ్, ఇక్బాల్,అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



రెజిమెంటల్‌బజార్‌లో లాస్యనందితకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ప్రచారానికి ర్యాలీగా వెళ్తున్న బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్,మార్కెట్ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి



తిరుమలగిరిలో కరపత్రం అందజేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ శ్యామ్ కుమార్



మ్యానిఫెస్టోను మైనార్టీ నేతలకు అందజేస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,నవంబర్ 8: అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2 చివర్లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ బుధవారం మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు కాకి రంగు చొక్కా, తెల్ల ప్యాంట్ ధరించి, 5.4 అడుగుల ఎత్తు ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కేంద్రీయ విద్యాలయంలో యువ మంథన్ సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

బొల్లారం,నవంబర్ 8: బొల్లారం కేంద్రీయ విద్యాలయంలో బుధవారం యువ మంథన్ జీ 20 అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాలేరియన్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ పాదర్ వినయ్ కుమార్ రెడ్డి, కేవీ ప్రిన్సిపాల్ వీణా రోటే హాజరయ్యారు. ప్రతి ఏడాది విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది జీ 20 సదస్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు,ప్రాథమిక హక్కులు,పౌరసత్వ నైపుణ్యాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సదస్సులో 72 మంది విద్యార్థులు జీ20 దేశ నాయకులుగా పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూడలేని కబోది పవన్‌కళ్యాణ్

### తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి



కవాడిగూడ, నవంబర్ 8: తెలంగాణ వస్తే వారం రోజులు అన్నం ముట్టలేదన్న సినీ హీరో పవన్‌కళ్యాణ్‌కు తెలంగాణలో తిరిగే నైతిక హక్కు లేదని అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కవాడిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని, బీజేపీ పాలిత సీఎంలు, కేంద్ర మంత్రులు స్వయంగా తెలంగాణ సంక్షేమ పథకాలను మెచ్చుకున్నారని ఆయన గుర్తు చేశారు. కండ్లుండి చూడలేని కబోది పవన్‌కళ్యాణ్ అని ఆయన మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాలతో పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, ఇందులో ఒక్కటి కూడి అమలు కాలేదని పవన్‌కళ్యాణ్ అనడం అత్యంత సిగ్గు చేటన్నారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి పవన్‌కళ్యాణ్‌కు కనబడలేదా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు ఇక్కడ తిరగనివ్వరని ఆయన హెచ్చరించారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని మోదీకి వినతి

కవాడిగూడ, నవంబర్ 8: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజర్వేషన్లు కల్పించి, కేంద్ర క్యాబినేట్‌లో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీకి మంగళవారం బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశా చారి వినతిపత్రం అంద జేశారు. ఈ మేరకు బుధవారం దోమలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ జనాభాలో 50 కోట్లకు పైగా ఉన్న బీసీల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. బీసీల జనగణన చేపట్టాలని మోదీకి విన్నవించినట్లు చెప్పారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు సాయిని వెంకటేశ్ మృతి



సాయిని వెంకటేశం(ఫైల్)

అంబర్‌పేట, నవంబర్ 8 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది సాయిని వెంకటేశం(94) బుధవారం తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయన్ను కుటుంబసభ్యులు విద్యానగర్‌లోని శారదాంబ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతికి పద్మశాలి సంఘం నేతలు సంతాపం తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, సీనియర్ న్యాయవాది వనం విశ్వనాథ్, వనం దుశ్యంతల, అంబర్‌పేట నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు వీ. కృష్ణ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి పద్మశాలి సంఘాలకు తీరని లోటు అని కొనియాడారు.